మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటగా సాగు
- 120 రోజుల్లో చేతికొచ్చే పంట
- టన్ను గింజలు రూ. 39 వేలు
- ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి


దేవరపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

దేవరపల్లి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తున్న మొక్కజొన్న పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ పంట వరి కోతలు పూర్తయిన అనంతరం డిసెంబరు, జనవరిలో రైతులు మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. విత్తనం వేసిన అనంతరం 110 నుంచి 120 రోజుల్లో పంట చేతికి వస్తోంది. బోర్ల కింద రైతులు మొక్కజొన్న సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. మొక్కజొన్నకు మార్కెట్లో డిమాండ్ ఉండడంతో రైతులు రబీలో వరికి బదులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కజొన్నకు మార్కెట్లో మంచి ధర లభించడంతో రైతులు పంటపై ఆశలు పెట్టుకున్నారు. మెట్ట ప్రాంతంలోని గోపాలపురం నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు మొక్కజొన్న పండించి లాభాలు పొందుతున్నారు. గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి, ద్వారకాతిరుమల మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

7,306 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు

కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి, కొవ్వూరు, తాళ్లపూడి, గోపాలపురం, చాగల్లు మండలాల్లో 7,306 ఎకరాల్లో ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సుమారు 1,200 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగినట్టు అధికారులు తెలిపారు. ఎక్కువ మంది రైతులు విత్తనానికి పంట పండిస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు రైతులను మొక్కజొన్న సాగుకు ప్రోత్సహిస్తున్నాయి. పండిన పంటను కంపెనీలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నాయి. ఈ విధంగా కొనుగోలు చేసిన మొక్కజొన్నను కంపెనీలు విత్తన ఉత్పత్తికి వినియోగిస్తున్నాయి. ప్రస్తుతం టన్ను గింజల ధర రూ.39 వేలు ఉన్నందున ఎకరాకు సుమారు రూ.1.40 నుంచి రూ.1.60 లక్షలు ఆదాయం వస్తోందని రైతులు తెలిపారు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు వస్తోంది. ఖర్చులు పోను ఎకరాకు రూ.60 నుంచి రూ.70 వేలు మిగులుతోందని రైతులు తెలిపారు. 90 శాతం మొక్కజొన్న పంట ఉత్పత్తిని కంపెనీలు విత్తనోత్పత్తికి కొనుగోలు చేస్తుండగా, 10 శాతం వాణిజ్య అవసరాలకు రైతులు విక్రయిస్తున్నారు.

పౌల్ట్రీలకు సరఫరా

జిల్లాలో పౌల్ట్రీలతో పాటు మొక్కజొన్న ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలు స్థాపించడంతో పంటకు మంచి డిమాండ్ ఏర్పడింది. దేవరపల్లి సమీపంలో మొక్కజొన్నల నుంచి వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేసి పలు దేశాలకు ఎగుమతి చేసే భారీ పరిశ్రమను నెలకొల్పారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో పండిస్తున్న మొక్కజొన్నను పరిశ్రమ యజమానులు రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి సకాలంలో సొమ్ము చెల్లిస్తున్నారు. పరిశ్రమ అవసరాలకు ఇక్కడ మొక్కజొన్నల ఉత్పత్తి సరిపోక ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పౌల్ట్రీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో రైతులు మొక్కజొన్నను కొనుగోలు చేసి కోళ్లకు మేతగా వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది.


ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు

వరి తర్వాత ప్రధాన పంట

రబీలో వరి తర్వాత ప్రధాన పంటగా మొక్కజొన్న పండిస్తున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సుమారు 24,460 హెక్టార్లలో మొక్కజొన్న పండిస్తున్నారు. మొక్కజొన్నను చేపలు, కోళ్లు, పశువులకు దాణాగా, పాప్‌కార్న్, స్వీట్ కార్న్ రూపంలో వినియోగిస్తున్నారు. జిల్లాలో ఎకరానికి సరాసరిన 13 టన్నుల మొక్కజొన్న దిగుబడి వస్తోంది.

కొవ్వూరు డివిజన్‌లో మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
గోపాలపురం	1,014	3,143
నల్లజర్ల	1,084	2,882
కొవ్వూరు	67	101
చాగల్లు	31	88
తాళ్లపూడి	232	535
దేవరపల్లి	116	453
నిడదవోలు	23	86
పెరవలి	9	14

మెట్ట ప్రాంత రైతుల ఆసక్తి



మొక్కజొన్న పంట రైతుకు లాభసాటిగా ఉంది. సాగుపై మెట్ట ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు. రబీ సీజన్‌లో జనవరిలో పంట వేస్తారు. మే నెలలో దిగుబడి వస్తోంది. పూర్తిగా ఆరుతడి పంట కావడం వల్ల నీటి వసతిలేని వర్షాధార భూముల్లో రైతులు మొక్కజొన్న పండిస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లో 7,306 ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేశారు. డివిజన్‌లో 2,577 మంది రైతులు 5,895 ప్రదేశాల్లో పంట సాగు చేస్తున్నారు. గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. గోపాలపురం మండలంలో 3,143 ఎకరాల్లోను, నల్లజర్ల మండలంలో 2,882 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు.
– పి. చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులకు నేడు శిక్షణ

ఉండ్రాజవరం: నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులకు మండలంలో వేలివెన్నులోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ మంగళవారం తెలిపారు. ఈ శిక్షణలో ఘన వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి, చెత్త వేరు చేయడం వంటి వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణకు నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి వ్యాన్ బోల్తా


కొవ్వూరులో లాంచీల రేవు వద్ద డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన వ్యాన్

కొవ్వూరు: పట్టణంలో లాంచీల రేవు సమీపంలో మంగళవారం సాయంత్రం వ్యాన్‌కి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. వ్యాన్ రోడ్డుపై బోల్తా పడడంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆంజనేయ స్వామికి పూజలు


పెద్దేవంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: పెద్దేవం సాయి బాబా ఆలయం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ తదితరులు స్వామి వారికి పూజలు చేసారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు


ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరిస్తున్న డీఈ నారాయణం అప్పారావు

నల్లజర్ల: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తే గుర్తింపు తప్పక వస్తుందని విద్యుత్ శాఖ డీఈ నారాయణం అప్పారావు అన్నారు. భద్రతా నియమాలు పాటిస్తూ నైపుణ్యంతో సేవలందిస్తూ ఏపీఈపీడీసీఎల్ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులను డీఈ శాలువాలు కప్పి, సత్కరించి, ప్రశంసాపత్రం అందజేసారు. నల్లజర్ల మండలంలో అనంతపల్లి లైన్‌మెన్ తెప్పల హరిబాబు, ప్రకాశరావుపాలెం లైన్‌మెన్ తాళ్లూరి శ్రీనివాసరావు, చీపురుగూడెం ఏఎల్‌ఎం వెంకన్న, పోతవరం లైన్‌ఇన్‌స్పెక్టర్ వీయస్ఎన్ రాజు సత్కరించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివప్రసాద్, ఏఈలు బాపిరాజు, యం,రమణ, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో మంగళవారం సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానిక వీఆర్వో అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హండ్రెడ్ ఫీట్ రోడ్డులో కల్వర్టు పక్కన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతడు ఏడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మొలతాడులో పావలా సైజు దేవుడి ఇత్తడి బిళ్ల, తెల్లటి గెడ్డంతో ఉన్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ 94407 96533, ఎస్సై 94911 22811 నంబర్లను సమాచారం ఇవ్వవచ్చన్నారు.

అగ్రిస్టాక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మధురపూడి: రైతులు విధిగా అగ్రి స్టాక్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు అన్నారు. కోరుకొండ మండలం మునగాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ భూమిగల రైతులందరూ అగ్రిస్టాక్‌లో నమోదు కావాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలను అందుకోవచ్చన్నారు. అపరాలు, మొక్కజొన్న సాగులో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీలు జయలక్ష్మి, మల్లికార్జునరావు, మండలాధికారిణీ గౌరీదేవి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


తాడిపర్రులో తాగునీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామారావు, ఈవోపీఆర్డీ శర్మ

ఉండ్రాజవరం: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వి.రామారావు తెలిపారు. మండలంలో తాడిపర్రు తదితర గ్రామాల్లో మంగళవారం ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మతో కలిసి రక్షిత తాగునీటి ట్యాంక్‌లను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ పాయింట్లు, మోటార్లకు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్డీ నరసింహారావుకు సత్కారం

నిడదవోలు : స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, అప్పిలేట్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావును మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సందర్భంగా నరసింహారావును ఆయన దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులకు శిక్షణ


తడి, పొడి చెత్త వేరు చేయడంపై గృహిణులకు అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతమణి, డీఎల్‌పీఓ అమ్మాజీ

నల్లజర్ల: ఘనవ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు గంటావారిగూడెంలో చెత్తసంపద కేంద్రం వద్ద మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి శాంతమణి, డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ పాల్గొని వివిధ అంశాలను వివరించారు. తడి, పొడి చెత్త సేకరణపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని శాంతమణి సూచించారు. చాలా ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా కలిపి ఇస్తున్నారని, దీనిపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్గించాలన్నారు. స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం గృహిణులకు చెత్త సేకరణపై అవగాహన కల్గించారు. పడమర చోడవరం, అనంతపల్లిలోని చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు.మారెళ్ళమూడి, పడమర చోడవరంలో సమిత్వ సర్వేపై సమీక్షించారు. ఎంపీడీఓ సింహాద్రి, నల్లజర్ల, గోపిలపురం, దేవరపల్లి మండలాల నుంచి 64 మంది కార్యదర్శులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ చెత్తసంపద కేంద్రాన్ని గ్రామ నడిబొడ్డున కాకుండా దూరంగా తరలించాలని మహిళలు అధికారులకు ఫిర్యాదు చేసారు.

ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలి


పశివేదలలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు తయారు చేసిన గ్రామ నమూనా పటం, చిత్రంలో శాస్త్రవేత్తలు, అధికారులు

కొవ్వూరు: రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంపై అవగాహన పెంచుకుని నూతన సాగు విధానాలను అవలంబించాలని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్తలు సీహెచ్‌వీ నరసింహరావు, ఎం.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పశివేదలలో శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గ్రామీణ భాగస్వామ్యంపై విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. రైతులు ఆచరిస్తున్న వివిధ వ్యవసాయ సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. నూతన సాగు పద్ధతులను రైతులకు వివరించారు.

రైతులు మోతాదుకి మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు క్షేత్ర పరిశీలనలో గుర్తించినట్లు విద్యార్థులు సూచించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువుల వాడి చేనును సారవంతం చేసుకోవచ్చునని సూచించారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించుకుని కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు వినియోగించాలన్నారు. రంగురంగుల రంగవల్లిక ద్వారా గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. గ్రామ నమూనా పటం తయారు చేసి పంటల విస్తీర్ణం, వాటి వివరాలు, పంటల వరుస క్రమం, గ్రామ అభివృద్ధి, పంట కాలం, గ్రామ ప్రభుత్వం కార్యాలయాల పని విధానాలను చిత్ర పటం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.గంగాధర్, అభ్యుదయ రైతులు గారపాటి శ్రీనివాసరావు, గారపాటి రామచంద్రరావు, సూదిన శ్రీనివాస్, తాళ్లూరి తేజ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నరసన్న తీర్థానికి ఏర్పాట్లు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి తీర్థానికి జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి 15 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 10వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం జరుపుతారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

చాగల్లు: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 153 మంది విద్యార్థులకు 141 మంది పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ కేపీ పావని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 306 మంది హాజరు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షను 325 మంది విద్యార్థులకు 306 మంది రాసారు. 19 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రం వద్ద తాళ్లపూడి కరిబండి గనిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల, తాళ్లపూడి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. చీఫ్ సూపరింటెండెంట్ పి గౌరీనాథ్, డీవో శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

చాగల్లు: ఇంటి పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి గ్రామ కార్యదర్శలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్లలో షిల్ట్, చెత్త తొలగింపు వంటి విషయాల్లో శ్రద్ధ వహించాలని తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

8న జాతీయ మెగాలోక్ అదాలత్


కొవ్వూరులో కోర్టు హాలులో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: ఈనెల 8న కొవ్వూరులో నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. స్థానిక కోర్టు హాలులో మంగళవారం పోలీసు, బ్యాంక్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, కోడూరి నరసింహరావు, వుప్పల కృష్ణారావు, తాడేపల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు.

హెల్త్ సైన్సెస్ చదివితే మంచి ఉద్యోగావకాశాలు

రాజానగరం: హెల్త్ సైన్సెస్ అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సీపీఓ డాక్టర్ కె.విజయ భాస్కరరాజు అన్నారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, డీన్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ బి.శ్రీనివాసరాజు, కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

9న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ అర్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు, భక్తులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో తోకల వంశీయులు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోందన్నారు. ఆ స్తంభం ప్రస్తుతం శిథిలస్థితికి చేరడంతో తోకల వారి వారసులు ఇప్పుడు పునఃప్రతిష్ఠిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు జరుగుతాయన్నారు. 9వ తేదీ ఉదయం 10.54 గంటలకు యంత్ర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, అనంతరం మహాన్నసమారాధన ఏర్పాటు చేశారన్నారు.

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ కల్యాణోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం కోరుకొండలోని ప్రధాన కూడళ్లు, బస్టాండు, కూరగాయల మార్కెట్, పాత సంత మార్కెట్, సంత బజారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, సినిమా థియేటర్, పోలీసు స్టేషన్ సెంటర్లలో పోలీసులు తయారుచేసిన స్కీమ్ చార్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఉత్సవాలతో పాటు పోలీసుల సమాచారాన్ని ఉంచుతామన్నారు. అలాగే డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్‌తో కలిసి స్వామివారి దేవస్థానం పరిసర ప్రాంతం, రథోత్సవం నిర్వహించనున్న రోడ్లను పరిశీలించారు.

భద్రతా పరికరాల వినియోగంలో నిర్లక్ష్యం తగదు



కొవ్వూరులో మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాథరావు

కొవ్వూరు: ప్రతి కార్మికుడు ప్రమాదకరమైన ప్రాంతాల్లో పని చేస్తున్న సమయంలో కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించాలని, చిన్న పాటి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల బారిన పడతారని త్రినాథరావు సూచించారు. ఆంధ్ర సుగర్స్ కరాగారంలో మంగళవారం జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. విధుల్లో ఉన్న సమయంలో కార్మికులు అప్రమత్తతో వ్యవహరించాలని, భద్రతా పరికరాల వాడకంలో అలసత్వం వహించవద్దని సూచించారు. వివిధ కంపెనీల్లో సంభవించిన ప్రమాదాలు, వాటికి గల కారణాలను ఆయన కార్మికులకు వివరించారు. ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు, భద్రతా అధికారి కేవీవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నింబధనల మేరకు కార్మికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యక్తిగత నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఫ్యాక్టరీ భద్రతా పరికరాలు సక్రమంగా వినియోగించిన కార్మికులకు బహుమతులు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, సగ్గొండ ఫ్యాక్టరీ జి.రమేష్ పాల్గొన్నారు.

ఇంటిలో మగపిల్లలకూ జాగ్రత్తలు చెప్పాలి


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న జిల్లా మహిళా అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తల్లిదండ్రులు ఎప్పుడూ ఇంటిలో ఆడపిల్లలకు జాగ్రత్తలు చెబుతుంటారని, వారితో పాటు మగపిల్లలకు జాగ్రత్తలు చెప్పాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి అన్నారు. జయహో మహిళా దినోత్సవంలో భాగంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సరస్వతీ ఘాట్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీలక్ష్మి ప్రారంభించారు. అనంతరం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, మహిళా ఇన్‌స్పెక్టర్ మంగాదేవి, సీడీపీవోలు సీహెచ్‌వీ నరసమ్మ, నాగమణి, బేబీ రాణి, ఎస్సై అమీనా బేగం, పోలీసు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు.

ఆర్ట్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో పీజీ విద్యార్థులకు శనివారం నిర్వహించిన చైతన్య స్కూల్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జేకేసీ చైర్మన్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. వీటికి 106 మంది హాజరవ్వగా, ప్రాథమికంగా భాగంగా జరిగిన రాత పరీక్ష, డెమో (సబ్జెక్టు వివరణ) 65 మంది ఎంపిక అయ్యారన్నారు. చైతన్య విద్యా సంస్థల నుంచి కో ఆర్డినేటర్లుగా అరుణ్ కుమార్, కిరణ్ పాండే బృందం హాజరైంది. జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి, కళాశాల ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ వై.రాము, పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, పీజీ సబ్జెక్టుల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.